# అనుమానం

కశింకోట ప్రభాకరదేవ్

**చీకటి** వెలుగును కబళిస్తున్న వేళ ధూళిని రేపుకుంటూ పోలీసు జీపు ఆ గ్రామంలోకి ప్రవేశించింది. రాబందుల రెక్కలచప్పుడుకు తల్లి రెక్కల చాటున దాక్కునే కోడిపిల్లల్లాగా జీపు శబ్దానికి ఆ గ్రామంలోని జనం తమ తమ గుడిసెల్లోకి భయం భయంగా జారుకున్నారు.

క్షణాలమీద గ్రామమంతటా శ్మశాన నిశ్శబ్దం అలముకుంది. ఇన్నేళ్ళ స్వాతంత్ర్యానికి, సాధించిన ప్రగతికి మూగసాక్షిలాగా ఉన్న వో గుడిసెముందు జీపు ఆగింది. అందులోనుండి పోలీసులు బిలబిలమంటూ దిగి, గుడిసెలోకి జొరబడ్డారు.

పోలీసుల బూట్ల చప్పుడుకు గుడిసె వణికింది.

జ్వర తీవ్రతలో మూలుగుతూ కుక్కిమంచం మీద పడుకున్న వీరన్న జవాన్లను చూసి కంపించిపోయాడు.

భయంతోనూ, ఆశ్చర్యంతోనూ గొంతు తడారి పోయింది.

"తవరా ... బాబూ!.. నానేం సెయ్యనేదే!? ..." అన్నాడు గొంతు అతి కష్టం మీద పెగుల్చుకుంటూ.

"నోర్మూసుకుని ముందు జీపెక్కు" విసురుగా లాఠీని త్రిప్పుతూ గర్జించాడు హెడ్ కానిస్టేబులు.

"వారం రోజుల్నుండి జొరం దొరా! మంచం దిగలేదు ..." వేడికోలుగా అన్నాడు వీరన్న.

అంతవరకూ వూపిరి బిగబట్టుకొంటూ గుడిసెలో ఒక మూలగా నిల్చున్న వీరన్న కోడలు "అవును బాబూ! వారం రోజుల్నుండి జొరంతో మా మావ గుడిసెనుండి కదలనేదు" అంది.

హెడ్ కానిస్టేబులు వీరన్న కోడలి వైపు పోలీసు చూపొకటి విసిరాడు.

"పిల్లికి ఎలక సాక్ష్యంలాగా ఉంది నీ యవ్వారం" అంటూ జవాన్ల వైపు తిరిగి "ముందు ఈ ఎదవని తీసుకెళ్ళి జీపులో పడేయండి. త్వరగా వెళ్ళకపోతే యస్సైయి మనల్ని కరిచేస్తాడు" అన్నాడు.

జవాన్లు వీరన్నను ఈడ్చుకుంటూ వెళ్ళి జీపులో పడేశారు. హెడ్ కానిస్టేబుల్ ఫ్రంట్ సీటులో కూర్చోగానే జీపు ముందుకు కదిలింది.

జీపు వెనుక సీట్ల మధ్య పడి ఉన్న వీరన్నకు కళ్ళ ముందు ఏవేవో చీకటి తెరలు కదలాడుతున్నట్లనిపించింది.

● ● ●

పోలీసు స్టేషనది.

అక్కడంతా చట్టబద్ధంగానే ... పకడ్బందీగానే జరిగిపోతుంటుంది!

గోడలు, లాఠీలు సైతం రక్తవర్ణాన్నే రూల్సు ప్రకారం ఆశ్రయించుకుని ఉంటాయి.

రివాల్వింగ్ చైర్‌లో అసహనంగా కూర్చుని ఉన్నాడు యస్సైయి.

యస్సైయికి ఎదురుగా నిలుచున్న హెడ్ కానిస్టేబులు మాటి మాటికి తన టోపీని సర్దుకుంటున్నాడు.

"ఆ నగ లెక్కడ దాచావో త్వరగా చెప్పేయి ..." అన్నాడు యస్సైయి వీరన్నతో.

"సత్తె పెమానకంగా ఆ నగలేవిటో ... నా నెరుగను. వారం రోజుల్నుండి జొరంతో గుడిసె కదల్లేదు, దొరా!" కన్నీళ్ళతో చెప్పాడు వీరన్న.

జ్వరం వలన, నీరసం వలన, భయంతోనూ అతడికి కళ్ళు తిరుగుతున్నట్లనిపించసాగింది.

యస్సైయి ముందు సరిగ్గా నిలబడలేకపోతున్నాడు.

కాళ్ళు లాగేస్తున్నాయి.

గుండె లోతుల నుండి బయలుదేరిన వణుకు నరాల్లోకి కార్చిచ్చులాగా వ్యాపిస్తూంది.

"వీడు మాటలతో లొంగడు సార్! రెండు తగల్నిస్తే సరి" అన్నాడు హెడ్ కానిస్టేబులు యస్సైతో.

హెడ్ కానిస్టేబులు స్పీడుకు ముచ్చటపడుతున్నట్లుగా చూసి, కాసేపు ఆగమన్నట్లుగా చేత్తో సైగ చేశాడు యస్సై.

"ఒరేయ్, వీరన్నా! పోలీసోడి దగ్గరా, ప్లీడరు దగ్గరా నిజం దాస్తే ఎవడూ బాగుపడడు. ఇక, నీలాంటోళ్ళు అసలే బాగుపడరు. నన్నిక ఎక్కువగా విసిగించక నిజం చెప్పేసెయ్యి. ఆ నగ లెక్కడ?" అనునయంగా ప్రశ్నించాడు యస్సై.

"నాను దొంగతనం సేస్తే మీకు సెప్పకుండా ఎప్పుడన్నా దాచేనా దొరా? నానెప్పుడన్నా తవరి దగ్గర మాట తప్పి ఎరుగుదునా?" తన నిజాయితీతో ఎదురు ప్రశ్నించాడు వీరన్న.

యస్సైయి మౌనం వహించాడు కొద్ది క్షణాలు.

వీరన్న సిన్సియారిటీ యస్సైయికి తెలియంది కాదు. సంవత్సరాల తరబడి వీరన్న తమకు తెలుసు. ఎన్నడూ పోలీసుల కన్ను కప్పిన దాఖలు లేదు.

"నువ్వు చెప్పింది నిజమేరా, వీరన్నా! ఇంతవరకూ నువ్వు సిన్సియర్‌గానే ఉండవచ్చు. కాని, ఈసారి మాత్రం నాకు అనుమానం కలుగుతోంది." పోలీసు లౌక్యాన్ని ప్రదర్శిస్తూ అన్నాడు యస్సైయి.

"తవరే అనుమానపడితే ... ఇక నాకు దిక్కెవరు, దొరా! ఆ దేవుడి తోడుగా నానేం దొంగతనవూ సెయ్యనేదు."

సాలోచనగా తల పంకించాడు యస్సైయి.

"సర్లే ... నువ్వు తియ్యకపోతే భయం లేదులేగాని, ఆ అమ్మవారి నగలను మాత్రం నువ్వు తీసేసినట్లు ఒప్పేసుకో, కేసు బనాయించేస్తాను" అన్నాడు.

"అన్నాయం, దొరా! అమ్మవారి నగలను నానేం తియ్యనేదు. కేసు బనాయించేత్తా నంటారేటి?" అన్నాడు దిగ్భ్రాంతితో.

యస్సైయి భారంగా నిట్టూర్చాడు. ఆ నిట్టూర్పులో ఏదో నిస్సహాయత...

"అదంతేరా, వీరన్నా! తప్పదు మరి. తెల్లవారేలోగా కేసు పూర్తి చేసెయ్యాలని మా మొగుడు వార్నింగు ఇచ్చేశాడు. మావాళ్ళు విన్నోట్టు కొట్టేశారు. గుడి దొంగతనాల్లో నువ్వు చెయ్యి తిరిగినోడివి గదా! అందుకనే, మా పోలీసోళ్ళ కళ్ళు నీ మీద పడినాయి. మరందుచేత, నువ్వీ కేసును ఒప్పేసుకోవాలి," నచ్చచెబుతున్నట్లుగా అన్నాడు యస్సైయి.

నీరసంగా తల విదిలించాడు వీరన్న.

"నానెట్టా ఒప్పుకోగల్ను, దొరా! మరింక నాను దొంగతనాలు సెయ్యనని కొడుకు దగ్గర ఒట్టేసుకున్నాను" అన్నాడు.

వీరన్న మాటలకు ఫకాలున నవ్వేడు హెడ్ కానిస్టేబులు.

"ప్రతి దొంగ ఎదవా మంచోడయిపోతే ఇక మాకు కేసులెట్టాగ వొస్తాయి? కథలు సెప్పకుండా ఈ కేసును ఒప్పేసుకో. ఈ ఒక్క సారికి నువ్వు ఒప్పేసుకున్నావంటే మరిక ఇంకెప్పుడూ నీ జోలికి యస్సైయి బాబుగారు రారు' అన్నాడు.

పులి పంజాకు చిక్కిన లేడి పిల్లలాగా చూశాడు వీరన్న.

"మీ కాళ్ళు మొక్కుతా, దొరా! నన్నిడిసి పెట్టేయండి. జొరంతో నా పేనాలు పోతున్నాయి" నీరసంగా అన్నాడు వీరన్న. మాట్లాడడానికి కూడా శక్తినంతా కూడదీసుకోవాల్సి వస్తోంది.

"నిన్ను ఇప్పుడు విడిచిపెడితే రేపు మేమంతా మా ఉద్యోగాల మీద ఆశల్ని వొదులుకోవాలి" అన్నాడు యస్సైయి చిరాగ్గా.

హెడ్ కానిస్టేబులు అసహనంగా తల విదిలించాడు.

"నిన్ను యిడ్సిపెట్టడం కుదరదు. బుద్ధిగా, ఏ గొడవా సెయ్యకుండా ఈ కేసును ఒప్పేసుకో. లేదంటే మా సంగతి తెల్సుకదా! ఏదో ముసిలోడివని ఇంతవరకూ వూరుకున్నాం" అన్నాడు లాఠీని వూపుతూ.

వీరన్న దీనంగా యస్సైయి వైపు

చూశాడు. మరింక నిల్చోవడానికి కూడా శక్తి లేనట్టుగా నేల మీద కూలబడ్డాడు.

స్పృహ తప్పిపోతున్న వీరన్నను కొద్ది క్షణాలపాటు నిశితంగా చూశాడు యస్సైయి. అతడి పోలీసు బుర్రలో ఏదో ఆలోచన కుబుసం విడిచిన పాములాగా కదలాడింది.

హెడ్ కానిస్టేబుల్‌ను దగ్గరకు పిలిచి చెవిలో ఏదో గుసగుసలాడేడు.

• • •

అర్ధరాత్రి!

చీకటి వర్షిస్తున్న వేళ...

శ్మశానంలో నక్కలు శవాలను పీక్కుతింటున్న వేళ...

పోలీసు స్టేషన్లో యస్సైయి ముందు వీరన్న కొడుకు, కోడలు ప్రాణాలను అరచేతుల్లో పట్టుకుని నిల్చున్నారు. తన కొడుకును, కోడల్ని పోలీసులు స్టేషనుకు తీసుకు రావడంతో వీరన్నకు మరింతగా గుండె దిగజారిపోయింది.

హెడ్ కానిస్టేబులు టోపీని సవరించుకుంటూ వచ్చి వీరన్న, వీరన్న కొడుకుల మధ్యన నిలుచున్నాడు.

"సిలక్కి సెప్పినట్టు సెప్పినా ఈ ఎదవ యినుకోకుంటున్నాడు. జొరంలో సచ్చిపోతున్నాను, యిడిసిపెట్టేయమని ఏడుత్తున్నాడు. సరే, యిడ్చిపెడ్తాం. మరి ఆ అమ్మవారి నగల్ని మేం ఎక్కడ్నుంచి తేటం? ఆ సంగతి ఎట్టాగ తేల్తుంది? అందుకని, నా దొక చిన్న సలహా. సెప్పమంటావా?" అని అడిగాడు వీరన్న కొడుకును హెడ్ కానిస్టేబులు.

చెప్పమన్నట్టుగా తలాడించాడు వీరన్న కొడుకు.

స్టేషనుకు తనను, తన భార్యను పోలీసులు దవుర్జన్యంగా ఈడ్చుకు వచ్చినందుకు రోషంతోనూ, అవమానంతోనూ అతడి మనసు దహించుకుపోసాగింది.

హెడ్ కానిస్టేబులు మరో సారి వీరన్న వైపు చూసి, పోలీసు నవ్వొకటి విసిరి, కొడుకు వైపు దృష్టిమళ్ళించాడు.

"మీ అయ్య మాకు తెలిసినోడే. ఆ ఎదవ సంగతి ఇక్కడ ఉన్నోళ్ళందరికీ తెలుసు. మంచోడే. మరందు సేతనే జొరంతో సచ్చినట్టు ఉన్నాడని దయతలచి ఈ సలహా ఇస్తున్నాం. అమ్మవారి నగలు దొంగతనం చేసినట్టుగా ఒప్పుకోకుంటున్నాడు మీ అయ్య. అందుకని, మీ అయ్యను ఇడిసి పెట్టేస్తాం. అయితే, అందుకో కండీషనుంది. ఆ నగలు మొత్తం పది తులాలు ఉంటాయి. అంత బంగారం మీరే ఇచ్చుకోవాలి. ఆ బంగారాన్ని మా పోలీసు శేటో ఉంచేసుకొని పంచేసుకుంటారని అనుకోవద్దు. ఆ బంగారాన్ని కరిగించేసి, కేసును మరో కేటుగాడి మీద రుద్దేసి, మీ అయ్యను వొదిలేస్తాం. తెల్సిందా?" అన్నాడు హెడ్డు.

"అంత బంగారం మా దగ్గర ఎక్కడ ఉంటుందండీ?" వైరాశ్యంగా అన్నాడు వీరన్న కొడుకు.

"ఆ సంగతి నాకేం తెలుసు? ఇంట్లో నుండి తెస్తావో, మరింకెక్కడనుండైనా కొట్టుకొస్తావో మాకు అనవసరం. తెల్లవారేలోగా కేసు తేలిపోవాల. లేకపోతే, మా అయ్యగారి బుర్ర పిచ్చెక్కిపోతుంది. అయ్యగారికి పిచ్చెక్కితే ఏటి సేస్తారో నాకే తెలవదు. మరందు సేత, నువ్విప్పుడు వెళ్ళిపోయి తెల్లవారేలోగా బంగారం పట్టుకు రావాలి. లేకపోతే మీ అయ్య పూచి, మీ ఆడదాని పూచి నాకు నేదు. తెల్సిందా?" సీరియస్‌గా హెచ్చరించాడు హెడ్డు.

• •

తూర్పు దిక్కున దినకరుడు వెలుగు కొరడాను ఝుళిపించడానికి సమాయత్తమవుతున్నాడు.

పరిస్థితుల ప్రభావానికి తల ఒగ్గి, ఆశయాలకు తిలోదకాలిచ్చేసి, బరువెక్కిన మనసుతో ఆవేదనగా, అలసటగా పోలీసు స్టేషన్లోకి పరిగెత్తుకొంటూ వచ్చేడు వీరన్న కొడుకు.

కుర్చీలో కునికిపాట్లు పడుతున్న హెడ్డు ఉలిక్కిపడ్డాడు.

వీరన్న కొడుకువైపు ఆత్రంగా చూశాడు.

అతడి బట్టలన్నీ మట్టి కొట్టుకుపోయాయి.

జుత్తు చెదరి ఉంది.

శరీరమంతటా చెమట.

చేతిలోని చిన్న మూటను హెడ్ కానిస్టేబులుకు అందించాడు వీరన్న కొడుకు.

హెడ్డు ఆమూటను గబగబా విప్పేడు.

నగలు! బంగారం నగలు!

కళ్ళు చెదరేటట్టుగా ఉన్న అమ్మవారి నగలు!

హెడ్ కానిస్టేబులు ముఖంలో అంతులేని ఆశ్చర్యం చోటు చేసుకుంది. ఆ ఆశ్చర్యం స్థానంలో క్రమక్రమంగా కోపం చోటు చేసుకుంది.

"హమ్మ! ముసలి నంజకొడకా! దొంగతనం సేసేసి, ఇంట్లోనే అమ్మవారి నగలు ఉంచేసుకుని, మమ్మల్ని ఇన్ని తిప్పలు పెడతావంట్రా?" అంటూ బండబూతులు తిడుతూ వీరన్న డొక్కలో బలంగా బూటు కాలితో తన్నేడు.

అమ్మవారి నగలను, కొడుకు ముఖాన్ని ఆశ్చర్యంగా చూస్తున్న వీరన్న ఆ తాపుకు ఉండచుట్టుకుపోతూ "అమ్మా!" అంటూ ఆర్తనాదం చేశాడు.

ఆ ఆర్తనాదం ఆ స్టేషన్లో అనాథకంగా ప్రతిధ్వనించింది. వీరన్న ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

రెండు రోజుల తర్వాత —

ఉదయాన్నే వాలు కుర్చీలో కూర్చుని ఆ రోజు దిన పత్రికను చదువుతున్నాడు వినాయకరావు.

వినాయకరావు ఘరానా మనిషి.

ఒక్కొక్క మెట్టు ఎదిగిన జీవితమతనిది.

దిన పత్రికను చదవడంలో నిమగ్నమైన వినాయకరావు ఒక చోట ఉలిక్కిపడ్డాడు.

"అమ్మవారి నగల దొంగ అరెస్టు" అనే హెడ్డింగుకు అతడిలో కలవరం చెలరేగింది.

ఆత్రతగా చదవసాగేడు.

'ఇటీవల స్థానిక ఆలయంలో జరిగిన అమ్మవారి నగల చోరీలో దొంగను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రంగడు అనే పేరుగల ఈ దొంగ తన నేరాన్ని అంగీకరిస్తూ, అమ్మవారి నగలను పోలీసులకు అందచేశాడు. అయితే, ఈ వార్త తెలిసిన రంగడి తండ్రి వీరన్న తన కొడుకు దొంగగా మారడాన్ని తట్టుకోలేక గుండె ఆగి మరణించాడు.'

ఈ వార్తను చదవగానే వినాయకరావుకు చెమటలు పట్టేశాయి.

కుర్చీలోనుండి లేచి పరుగు వంటి నడకతో మూల గదిలో బీరువా దగ్గరకు వెళ్ళి చూశాడు.

దాని తాళం తెరిచి ఉంది. లోపల బోసిగా ఉంది!

